## క్లుప్తంగా

### ముమ్మరంగా పారిశుధ్య పనులు

సీతంపేట: మండల కేంద్రంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచ్ ఆరిక కళావతి పర్యవేక్షణలో సామాజిక భవనం పక్క వీధిలో శుక్రవారం కాలువలను శుభ్రం చేశారు. దోమల నివారణలో భాగంగా అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కళావతి కోరారు.

### పరిశుభ్రతతో ఆరోగ్యం



బావి వద్ద తాగునీటి స్థితిగతులు పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం ముడిపడి ఉందని మండల ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. పారిశుధ్య పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని వాటపాగులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 15 రోజులుగా చేపట్టిన పనులపై సర్పంచ్ వి. రామారావు, ప్రజల సమక్షంలో ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని తాగునీటి వనరులు, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, వెలుగు ఏపీఎం సూరమ్మ పాల్గొన్నారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

కొమరాడ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుస్తకాలు, బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

### పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం తగదు..

భామిని: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో అంటురోగాలు ప్రబలుతున్న తరుణంలో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ కొవ్వాడ కిశోర్‌కుమార్, ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు సూచించారు. మండలంలోని గురండిలో శుక్రవారం వారు పర్యటించి, పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. దోమల నివారణ మందు దగ్గరుండి పిచికారీ చేయించారు.

### మలద్వారం లేని శిశువు జననం

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం మలద్వారం లేని శిశువు జన్మించింది. మండలానికి చెందిన ఓ గర్భిణి ప్రసవం నిమిత్తం ఆస్పత్రిలో చేరగా సిజేరియన్ చేశారు. 3.45 కిలోల ఆడ శిశువు జన్మించింది. మలద్వారం లేకపోవడంతో చికిత్స చేసి విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేసినట్టు ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. శిశువు ఆరోగ్యంగా ఉందన్నారు.

### కురుపాం తహసీల్దార్‌గా రవణమ్మ



తహసీల్దార్ రవణమ్మ

కురుపాం: తహసీల్దార్‌గా ఎం.రవణమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

### సాగునీటికి ఇక్కట్లు..



వరి పొలాలకు మోటార్ల సహాయంతో నీటి తడులు అందిస్తున్నన్న రైతులు

పాలకొండ రూరల్: మండలంలోని రైతులు సాగునీటికి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో సేద్యం కీలక దశలో ఉందని రైతులు చెబుతున్నారు. వరుసగా కురిసిన వర్షాలకు మండల శివారు ప్రాంతాలైన వెలగవాడ, రుద్రిపేట, సీతంపేట, తదితర ప్రాంతాల్లో వరి నాట్లు వేశారు. తాజాగా జలవనరుల శాఖ యంత్రాంగం తోటపల్లి కాలువల ద్వారాసాగునీరు విడుదల చేసినటప్పటికీ, శివారు గ్రామాలకు నీరు అందకపోవడంతో పంట పొలాలకు నీరు అందించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని పండ, రామభద్రరాజుపేట వద్ద మోటార్ల సాయంతో వరి భూములకు నీటి తడులు అందించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శివారు భూములకు సాగునీరు అందించాలని అభ్యుదయ రైతు కె.ప్రసాదరావుతో పాటు పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎరువుల వినియోగంలో
# అవగాహన తప్పనిసరి ..



పంటకు ఎరువులు వేస్తున్న రైతు (ఫైల్)

- యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు
- వ్యవసాయాధికారులు

పాలకొండ రూరల్: వరుణుడి కరుణతో ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన రైతులు పంట దిగుబడులు పెంచుకునేందుకు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో అన్నదాతలు సంబంధిత అధికారుల సలహాలు, సూచనలు పాటించాల్సి ఉంటుంది. వాతావరణ అనుకూలతను అందిపుచ్చుకుని రైతులు తమ భూముల్లో వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతుండగా.. మరికొన్ని చోట్ల ఇప్పటికే నాట్లు వేయడం జరిగింది. వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖాధికారి ఎన్ని వాహిని తెలిపారు. సీజన్ ప్రారంభ దశలో విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల వాడకంపై క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు అందించారు. భూసారాన్ని బట్టి వాడదగ్గ రసాయన ఎరువులు, వాటి మోతాదు నిర్ణయించే మట్టి నమూనాలను అనుసరించి నత్రజని, భాస్వరం, పోటాష్, జింకు ఎరువులను సమతుల్యంగా వాడే విధానంపై పలు సూచనలు చేశారు.

**● యూరియా రూపంలో నత్రజని...**

నత్రజనిని యూరియా రూపంలో రైతులు వాడుకోచ్చు. నత్రజని పంటల ఎదుగుదలకు, పచ్చదనానికి ఉపయోగపడుతుంది. దీనిని మూడు భాగాలుగా విభజించి వాడాలి. మొదటి భాగం సాగులో దమ్ము చేసే ముందు వేయాలి. రెండో భాగం పిలకలు వేసే దశలో, మూడో భాగం పొట్ట (అంకురం) ఏర్పడే సమయంలో వేయాల్సి ఉంటుంది. వెద పద్ధతిలో అయితే బురద పనుల్లో మాత్రమే 36 నుంచి 48 గంటల తర్వాత కొద్దిపాటి నీరు పెట్టాలి. అదేవిధంగా 50 కిలోల యూరియాకు 10 కిలోల వేపపిండి, 250 కిలోల తేమ కలిగిన మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి పొలంలో వాడితే నత్రజని ప్రభావం పెరుగుతుంది.

**● దృఢపడటానికి భాస్వరం..**

భాస్వరం మొక్కల వేర్లు దృఢపడడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందువల్ల ఈ ఎరువును పూర్తిగా దమ్ము సమయంలో వేయాలి. లేదా నారు ఊడిసిన పది రోజుల్లోపు వేయాల్సి ఉంటుంది. ఎకరాకు 50 కిలోల వరకు వాడుకోవచ్చు.

**● పిండి పదార్థం తయారీకి..**

పొటాష్ వినియోగం వల్ల ఆకులు గరుకు కలిగి ఉంటాయి. దీని వల్ల పైరుకు చీడపీడల బెడద తప్పుతుంది. అంతేకాకుండా పిండి పదార్థం తయారీకి ఎంతగానో సహకరిస్తుంది. అందువల్ల పొటాష్‌ను నాట్లు వేసిన 10 రోజుల్లో 15 కిలోలు, చిరు పొట్ట దశలో మరో 15 కిలోలు రెండు విడతల్లో వేయాల్సి ఉంటుంది.

**● నాణ్యత పెరుగుతుంది..**

ఎకరానికి 20 కిలోల జింక్‌ను తగినంత ఇసుకలో కలిపి దమ్ములో గాని నాట్లు వేసిన తొలి పది రోజుల్లో వేసుకుంటే గింజలో నాణ్యత పెరుగుతుంది. పైరులో జింక్ లోపాలను గుర్తిస్తే అధికారుల సూచనల మేరకు జింక్ సల్ఫేట్‌ను అవసరమగు మోతాదులో పిచికారీ చేయాల్సి ఉంటుంది.

**అందుబాటులో ఎరువులు..**



రైతులకు అవసరమైన ఎరువులు రైతుసేవా కేంద్రాలు, సొసైటీల్లో సిద్ధంగా ఉన్నాయి. అన్నదాతలు అధికారుల సూచనల మేరకు ఎరువుల వాడడం మంచిది. సరైన సమయంలో తగిన మోతాదు మేరకు ఎరువుల వాడకం చేపడితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. - ఎన్ని వాహిని, వ్యవసాయశాఖాధికారి, పాలకొండ.



డీఏపీ



యూరియా



పొటాషియం



జింక్

### అధ్వానంగా భవిత కేంద్రం



అధ్వానంగా ఉన్న కురుపాం మండల కేంద్రంలోని భవిత కేంద్రం

కురుపాం: మండల కేంద్రంలోని భవిత(ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రం) కేంద్రం అధ్వానంగా ఉంది. ఈ కేంద్రంలోని 10 మంది వరకు ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. సర్వశిక్ష అభియాన్ నిధులతో కొన్నేళ్ల కిందట భవన నిర్మాణం చేపట్టారు. పర్యవేక్షణ లేకపోవడంతో భవనం అధ్వానంగా మారింది. స్లాబ్‌పై, స్టేడ్స్‌పై పిచ్చి మొక్కలు లేచిపోయాయి. భవనానికి చెందిన తలుపులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఇక్కడ పిల్లలు పరాయి పంచన ఉంటున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### సూచనలు పాటించాలి..



రైతులకు పొలంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్ : వ్యవసాయాధికారుల సూచనలను రైతులు తప్పకుండా పాటించాలని వ్యవసాయశాఖ పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్‌సీలు శారద, భారతి, స్థానిక ఎ.డి కె. రత్నకుమారి అన్నారు. మండలంలోని జంపరకోటలో ఎరువుల యాజమాన్యంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువుల వినియోగం, సీడ్ ఫౌండేషన్, కాలిబాటల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఎన్ని వాహిని, వ్యవసాయ సహాయకురాలు భవానీ, తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయానికి నష్టం చేసే కేంద్ర బడ్జెట్

కొమరాడ: కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించేలా ఉందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాల సెంటర్ వద్ద బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, సీఐటీయూ నాయకుడు కొల్లి సాంబమూర్తి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రెడ్డి శివనాయుడు, భవన నిర్మాణ కార్మికుల సంగం నాయకుడు గౌరునాయుడు, ఏపీ గిరిజన సంగం నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయింపుల్లో 21.2శాతం కోత పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా బడ్జెట్ తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను రైతులందరూ తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు.

### పీఓకు అభినందనలు

సీతంపేట: గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న డిప్యూటీ ఈఓ పోస్టు, ఆశ్రమ పాఠశాలల్లోని నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలని పీఓ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరావు, రవికుమార్, సూరిబాబు, దుర్గారావు, జయరామ, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతతో ప్రజా సమస్యలు పరిష్కరిద్దాం


- మండల సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్వరి



సమావేశంలో ప్రగతి నివేదికలు వింటున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను ప్రజాప్రతినిధులకు చదివి వినిపించారు. దీనికి స్పందించి ప్రజాప్రతినిధులు ఆయా సమస్యలు పరిష్కారం కోరుతూ అధికారులను ప్రశ్నించారు. భద్రగిరి సీహెచ్‌సీ ఆవరణలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, మలేరియా మందులు అందుబాటులో ఉంచాలని, నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ, పాఠశాల భవనాలను సకాలంలో పూర్తి చేయాలని, సాగునీరందించేందుకు గతంలో నిర్మించిన చెక్ డ్యాంలకు మరమ్మతు పనులు చేయించాలన్నారు. భద్రగిరి సీహెచ్‌సీ వైద్యాధికారిణి త్రివేణి మాట్లాడుతూ భద్రగిరి ఆస్పత్రికి బ్లడ్ స్టోరేజ్ యూనిట్ మంజూరైందని, నూతన భవనాలు ప్రారంభించిన నాటి నుంచి నిర్వహణకు తీసుకొస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ బాబూరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు రెండు పూటలా చేయాలనేది దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రక్రియ అని దాన్ని మార్పు చేసే వెసులుబాటు తమకు లేదన్నారు. ఆర్‌అండ్‌బీ జేఈ సుశీల మాట్లాడుతూ భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నిధులు రూ.2.90 కోట్లు మంజూరైందని, టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు చేపడతామన్నారు. దీనికి ముందు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేకు సభా వేదిక వద్ద దుశ్శాలువాలతో సన్మానించారు. జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, ఎంపీడీఓ జి.రమేష్ బాబు, డీటీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### నిర్లక్ష్యం తగదు..



బత్తిలిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రవీంద్ర

భామిని: జ్వరాల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం తగదని వైద్యాధికారులు కె.సంతోషిలక్ష్మి, కొండపల్లి రవీంద్ర, కె.శివకుమార్ అన్నారు. మండలంలోని గురండి, బత్తిలి, తాలాడ గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జ్వరపీడితుల నుంచి రక్తపూతలు సేకరించారు. జ్వరం ఉన్నప్పుడు ఆస్పత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందాలని సూచించారు. కార్యక్రమాల్లో సీహెచ్ఓ భాస్కరరావు, సబ్‌యూనిట్ అధికారి పి. అప్పారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### తల్లిపాలలో ఔషధ గుణాలు..



పాలకొండ రూరల్: గటాల డెప్పి వీధిలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

తల్లిపాలలో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయని పలువురు వక్తలు అన్నారు. తల్లిపాల వారోత్సవాల నేపథ్యంలో వాడవాడలా శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు పట్టడం వల్ల కలిగే ఉపయోగాలను బాలింతలు, గర్భిణులకు వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని సూచించారు. ఆరు మాసాల వరకు తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలని, అనంతరం వైద్యుల సూచనల మేరకు ప్రత్యామ్నా ఆహారం ఇవ్వాలన్నారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్

## జెండా రూపకర్త పింగళి ధన్యజీవుడు

- పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు



పాలకొండ రూరల్ : వెంకయ్య గొప్పతనం విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

పాలకొండ రూరల్ : భరతజాతి గర్వపడే జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య ధన్యజీవుడని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. పింగళి జయంతిని కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకయ్య జీవిత చరిత్ర, జెండా విశిష్టత, స్వాతంత్ర్య సంగ్రామంలో అశువులు బాసిన నాయకుల స్ఫూర్తిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

**నివాళులు..**



పాలకొండ: పింగళి వెంకయ్య చరిత్రను వివరిస్తున్న హెచ్‌ఎం పరాంకుశంనాయుడు

పాలకొండ: పట్టణంలోని వెంకమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం పరాంకుశంనాయుడు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవితచరిత్రను హెచ్‌ఎం వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..



పాలకొండ: ఆందోళన చేస్తున్న ఎస్సీ సంఘాల నాయకులు



భామినిలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

- ఎంఆర్‌పీఎస్ నాయకులు

భామిని: ఎస్సీ వర్గీకరణకు అనువుగా మాదిగలు, ఇతర ఉపకులాల విభజనకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతులు ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు బత్తిలి, భామినిలో శుక్రవారం అభినందన సభలు నిర్వహించి, కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. బత్తిలిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంఆర్‌పీఎస్ నేత టింగ అన్నాజీరావు, సర్పంచ్ టింగ శాంతికుమారిల ఆధ్వర్యంలో.. భామినిలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు కవిటి రాజు, లోపింటి రాజేష్, బొమ్మాళి సంజీవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ప్రధాని మోదీ, తీర్పు ఇచ్చిన జడ్జిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఎస్సీ వర్గీకరణ నిబంధనలకు విరుద్ధం**

పాలకొండ : ఎస్సీ వర్గీకరణ నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఎస్సీ కుల సంఘ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి, ఏలాం సెంటర్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు నూతలపాటి భరత్‌భూషణ్, వై. లిల్లీ పుష్పనాథం, బత్తిన మోహనరావు, తదితరులు మాట్లాడుతూ... కులగణన చేపట్టకుండా వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ వర్గీకరణ అని ప్రశ్నించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణేష్‌బాబు, ఉమా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టి సారించాలి

- ఎంపీడీఓ రామకృష్ణ



వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష చేపడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: మండలంలో అభివృద్ధి పనుల పురోగతిపై అన్ని శాఖల అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్, విద్యా, ఐసీడీఎస్, వ్యవపసాయ, హౌసింగ్ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తాజా స్థితిగతులపై ఆరా తీశారు. ప్రజలకు శాశ్వత ప్రజయోజనాలు చేకూరేలా నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుత వ్యవసాయ, వర్షాకాల సీజన్ నేపథ్యంలో రైతులు, ప్రజలకు అందించే సాగు, తాగు నీటి సరఫరాలో లోపాలు అధిగమించాల్నారు. ఇతర శాఖల సమన్వయంతో పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

## చినకుదమలో గజరాజుల సంచారం



చినకుదమ పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గౌరీపురం, చినకుదమ, పెదకుదమ పంట పొలాల్లో గజరాజులు శుక్రవారం సంచరించాయి. అరటి పంటను ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గజరాజులు గుంపు కుదమ పంచాయతీ పరిధిలో సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

## వీఆర్‌ఏలను నైట్ డ్యూటీ నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న వీఆర్‌ఏల మన్యం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు

కురుపాం: వీఆర్‌ఏలను రాత్రి విధుల నుంచి మినహాయించాలని పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. వీఆర్‌ఏలపై రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా మోపిన రాత్రి విధులను నిలుపుదల చేయాలన్నారు.

ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని, భద్రత కల్పించాలని కోరారు. మహిళలతో రాత్రి పూట డ్యూటీలు నిలుపుదల చేసి తెలంగాణ మాదిరిగా మన రాష్ట్రంలో కూడా పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 3న తహసీల్దార్లకు, 6న ఆర్‌డీఓలకు, 9న కలెక్టర్‌కు, 14, 15 తేదీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు.

## టేకు కలప స్వాధీనం



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు కలప

కురుపాం: అనుమతులు లేకుండా మ్యాక్సి పికప్‌లో తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.సింహాద్రి శుక్రవారం తెలిపారు. గుమ్మలక్ష్మీపురం నుండి పాలకొండ తరలిస్తుండగా పాలకొండ పరిసర ప్రాంతాల్లో కలపతో పాటు వ్యాన్‌ను పట్టుకొని కురుపాం ఫారెస్ట్ కార్యాలయానికి తరలించినట్టు చెప్పారు. అయితే అది రైతు వద్ద కలపే అయినప్పటికి అటవీశాఖ అధికారుల అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని అనుమతి పత్రాలు లేనందున పట్టుకొని అపరాధ రుసుం వేశామన్నారు.

## గిరిజన సమస్యలను పరిష్కరించండి

- మాజీ ఎమ్మెల్యే కళావతి



పీఓను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, ఎంపీపీ, తదితరులు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డిని శుక్రవారం ఆయన చాంబర్‌లో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏజెన్సీలో రహదారులు, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే గృహనిర్మాణాలు చేపట్టాలన్నారు. అర్హత కలిగిన గిరిజన రైతులకు కొండపోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. కొత్త పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు పార్టీలకతీతంగా సముచిత స్థానం కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పీఓ హామీ ఇచ్చారు. అనంతరం పీఓను ఎమ్మెల్యే, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు ఎ.కళావతి, సుశీల, తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్, మంగయ్య. తదితరులు పాల్గొన్నారు.